**శ్రీ రమణ జ్యోతి**

ఏప్రిల్ 2022

ఈ సంచికలో ...

# Sri Ramana Jyothi

April 2022

IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| 1. | **డా॥ కే.యస్. గారి 93వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| 2. | **శ్రీ భగవాన్ నా జీవితంలోకి ఎలా ప్రవేశించారు?** | బి. రవికృష్ణ శర్మ | 10 |
| 3. | **శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు (శ్రీ దేవరాజ ముదలియార్)** | జి. శ్రీహరిరావు | 21 |
| 4. | **శ్రీ భగవాన్ రమణ మహర్షి భక్తాగ్రేసరులు** | మల్లాది ఫణిమాల | 25 |
| 5. | Ask Not, for He Knows What is Best for You | Dr. K. Subrahmanian | 30 |
| 6. | Self-Knowledge (Part 2) | V. Krithivasan | 36 |
| 7. | A Plunge into Siva's Grace | Marlies Hibschenberger | 44 |
| 8. | Dr K Subrahmanain - A Tribute | Smt Mythreye Ramdas | 46 |
| 9. | The Human Dimension of Sri Bhagavan | G Srihari Rao | 50 |


## Events in Sri Ramana Kendram in April 2022

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 9th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
4. 28th - Bhagavan's 72nd Aradhana


© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.


**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# గొప్ప అనుకోవడమే కారణం

డా॥ కే.యస్. గారి 93వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

మనలో దాదాపు అందరమూ గౌరవప్రదంగా ఉండడానికి ఇష్టపడతాం. ఇతరులు నన్ను గౌరవంగా చూడాలని వాంఛిస్తాం. అలా గౌరవప్రదంగా ఉండడం కోసమని ఎన్నో చేస్తాం. ఒక వ్యక్తి ఏదైనా చేస్తున్నప్పుడు, ఆయనను గౌరవనీయునిగా భావించడం పరిపాటి. మీరు సమాజంలో ఒక హోదా కలిగి వుండడం, చక్కగా మాట్లాడడం, పాండిత్యం చూపడం, వ్రాయడం, మొదలైనవి చేయ గలిగితే గౌరవభావన చూపడం సమాజంలో జరుగుతుంది. అలాగ ఇతరులు గౌరవిస్తున్న సందర్భంలో మనం ముఖస్తుతికి పొంగి ఆనందిస్తాం. మరో విధంగా చెప్పాలంటే, మన జీవితకాలం మొత్తం, మనం గౌరవనీయులని ప్రజలను నమ్మించడానికి ప్రయత్నిస్తూ, అలా జరిగినప్పుడు సంతోషిస్తాం. ఆ ఆకర్షణతో, మరింతగా సమయాన్ని దానికై వెచ్చిస్తాం. ఆ కారణంగా, అది నిజమైనప్పటికీ, కానప్పటికీ, ఇతరులు మనకు కొన్ని లక్షణాలను ఆపాదిస్తారు. దానితో మనల్ని గురించిన భావన మరింతై, ఆ స్థాయిని నిలబెట్టు కోవాలనే ప్రయత్నం పెంచుతాం. అలా కృత్రిమంగా చేయడం కొద్దీ మనం దిగజారుతాం.

## నిజ స్వరూపాన్ని కప్పి పుచ్చడం

ఉదాహరణకు నన్ను అందరూ నేను భగవాన్ యొక్క గొప్ప

భక్తుడినని పొగుడుతూ వస్తే, నేను అది నిజంగా కానని నాకు తెలిసినప్పటికీ గొప్ప భగవాన్ భక్తుడైనట్లు ఇతరులు అనుకోవాలని శ్రమపడతాం. అంటే నేను నా నిజస్వరూపాన్ని కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తానన్న మాట. అంటే యథార్థానికంటే నేను ఎక్కువ గౌరవ ప్రదమైన వాడినన్న అభిప్రాయాన్ని ఇతరులకు కలిగించాలన్నది ఉద్దేశం. నేను అలా గౌరవించదగ్గ వ్యక్తిని కానని ఇతరులు గుర్తించడంలో ఆసక్తి చూపించనప్పుడు, ఎవరు ఏమనుకొంటే ఏమన్నది ఎఱుకలోకి వస్తుంది. వేరే ఎవరిలాగా నేనూ ఒకడిని అన్నది అవగతమైనప్పుడు, నా జ్ఞానం, నా హోదా, అన్నవి ఏవో యథాలాపంగా జరిగినవని తెలిసివచ్చి, ఇతరుల మెప్పు, పొగడ్తలు మొదలైనవాటికి ప్రాముఖ్యత ఏ మాత్రం ఇవ్వము. అలాగ నేను ప్రత్యేకంగా ఏమీ కానన్నది బోధపడినప్పుడు, ఇక ఏ విధమై స్పర్థ కూడ వుండదు.

నేను ఫలానా వాడిని, ప్రత్యేకమైన (గొప్ప) వాడిని అన్న భావన మనసు పోల్చుకొనడం వల్ల జరుగుతుంది. ఇతరుల కంటే మెరుగైన వాడినన్న భావన కలిగిస్తుంది. అందుకే అలాగ వున్నానన్న అభిప్రాయం ధృఢపడుతుంది. ఒక స్థిరమైన భావన కలిగి వున్న వ్యక్తి, అభిప్రాయాన్నే నిశ్చయించుకుని ఇతరుల కంటే గొప్ప వాడినని ఊహించుకొంటూనే ఉంటాడు. భగవంతుని కృప వల్ల అభిప్రాయాలను అటువుంచి, నేను ఇతరుల కంటే ఎక్కువ లేదా తక్కువ వాడిని కానన్న భావన కలిగి వుండడానికి నమ్రత అవసరం. నిజమైన అవగాహన వల్ల నమ్రత ఏర్పడుతుంది.

## స్థిరమైన భావన

ఉదాహరణకు, ఒక ఖచ్చితమైన అభిప్రాయము, నమ్మకము కలిగిన వ్యక్తులను మనం మెచ్చుకొంటాం. అంటే ఏమి జరిగినప్పటికీ వారు తమ అభిప్రాయాన్ని మార్చుకోరు. ఎటూ ఊగిసలాడరు. అలాంటివాళ్ళు గొప్పవాళ్ళని, అసాధారణ వ్యక్తులన్న భావన ఏర్పడుతుంది. కాని ఒక విషయం ఏమంటే అలాంటి వ్యక్తులు తమ వ్యక్తిత్వాన్ని కాపాడుకునేందుకు, ఎట్టి పరిస్థితుల్లోనూ, సత్యం విషయంలో కూడ కప్పిపుచ్చుకునేందుకు కూడ వెనకాడరు. జీవితమన్నది నిత్య స్థిరమైనది కాదు. కాని ప్రస్తుతం ఇది నా నమ్మకం, ముప్ఫై ఏళ్ళ క్రిందట ఇదే అభిప్రాయం కలిగివుండే వాడిని అదే నమ్మకాన్ని పాటిస్తూ వుంటానని, అది నా మూల సూత్రమని చెప్పలేము. నీవు నీ నియమ, మార్గాలకు కట్టుబడి వున్నట్లే, ఇతరులు కూడ వుండవచ్చు.

అన్ని పరిస్థితుల్లోనూ, ఒక నమ్మకాన్ని కలిగి వున్న వాళ్ళను జనం మెచ్చుకోవచ్చు. కాని అప్పుడప్పుడు అలాంటి వాళ్ళలో తాము చేస్తున్నది మంచిదేనా అన్న అనుమానం రేకెత్తుతుంది. కాని, ఆ శంకను ఇతరులతో పంచుకోము. కారణం ఇతరులు నేను స్థిరమైన స్వభావాన్ని కలిగిన వాడు కాదని అనుకుంటారన్న భయం. అంటే అలా కట్టుబడి వుండడం ద్వారా ఇతరులు మన గురించిన అభిప్రాయాన్ని మార్చుకొనకుండడమే మన జీవిత లక్ష్యమవుతుంది. కొంతకాలం పాటు మనకు దగ్గరగా వున్న వాళ్ళు మన గురించిన ఒక అభిప్రాయానికి వస్తారు. అలాంటి వాళ్ళ దృష్టిలోని మంచి నమ్మకాన్ని మారనివ్వకుండ వుండడానికి, మనం గౌరవనీయులన్న

అభిప్రాయం చెదరనీయకుండ వుండాలని మనం ఎంతో ఆసక్తిని చూపుతాం. ఆ దృక్పథం మనం కలిగి వున్నన్నాళ్ళు మనం సత్యం ఏమిటి అన్న అవగాహన చేసుకొనలేము.

అసలు బ్రహ్మం అంటే తెలియనపుడు మనం బ్రహ్మాన్ని గురించి ప్రయత్నం చేయలేము. మనసుకు అతీతమైన దాన్ని ఎలా అన్వేషించి తెలుసుకోగలం? అయినప్పటికి, అది ఏమిటి అన్న మానసిక చిత్తరువు మనకు ఉండవచ్చు. అలాగే, సత్యం, దేవుడు వీటనన్నింటి మన పరిమిత మనస్సుతోనే తెలుసుకొనే ప్రయత్నం చేస్తాం. మనకు వాటిని గురించిన యథార్థం కూడ మన పరిమిత మనస్సుల ద్వారా పరిమితంగానే వుంటుంది. అంటే, మనం ఊహించుకునే దేవుడు కూడ మన లాంటి స్థాయిలోనే ఉంటాడు. దేవుని హుండీలో ఏదో కొంత డబ్బు వేయకుంటే మన మీద కోపం వస్తుందని, ఏ కొద్దిసేపైన ఆయనను తలచుకోకపోతే శిక్షిస్తాడని ఇలాంటి అభిప్రాయాలు వస్తాయి. కారణం, మన గురించి మనకుండే భావనలే దేవుడు కూడ కలిగి ఉంటాడన్న నమ్మకమే.

## కృతజ్ఞతా భావం

మరొక విషయం. నలుగురూ మనల్ని కలవడానికి వస్తుంటే, గొప్పగా భావిస్తాం. వాళ్ళే కొంత కాలం తరువాత రాకుంటే వారు కృతఘ్నులని, నన్ను పనుల కోసం ఉపయోగించుకున్నారని అనుకుంటాం. వాళ్ళు ఎప్పటికీ మన పట్ల కృతజ్ఞతా భావంతో ఉండాలని ఆశిస్తాం. వాళ్ళు ఎవరిపై ఆధారపడకుండ స్వతంత్రు లయ్యారని సంతోషించం. దేవుని దయతో వాళ్ళు అలా మార

గలిగారని ఆలోచించం. ఎందుకంటే మన ప్రాధాన్యత ఏదో పోయిందని బాధపడతాం. అలాంటి భావన మన నాశనానికి దారి తీస్తుంది. ఇతరులు మన సలహాలను ఆశించినప్పుడు ఇవ్వాలి. అలా అడగనప్పుడు, ఎందుకోసమని ప్రశ్నించడం, మన మాట వింటుండమని అడగడం తప్పు. మనం ఏదో గొప్ప, ప్రత్యేకమైన వ్యక్తినని చౌక అభిప్రాయం లేకుంటే, అది సాధ్యమౌతుంది.

సత్యాన్వేషణ చేయడం అంటూ ఉండదు. తగిన సమయంలో అదే తెలియవస్తుంది. ఉదాహరణకు ఒక పెట్టె ఖాళీగా ఉన్నప్పుడు ఉపయోగపడుతుంది. మన హృదయం మనసుకు సంబంధించిన పలు విషయాలతో నిండివున్నప్పుడు, మన మనసులోపలి భావాలను గ్రహించడానికి వీలు కాదు. మనసు హృదయాన్ని కప్పి వుంచింది. ఆత్మ ఎప్పుడూ ఉండనే ఉంది, దాని ఎఱుకలోకి తెచ్చుకొనడం నీ పని. అలా జరగాలంటే, అహం తొలగిపోవాలి.

నేను ఫలానా వాడిని, నేను గొప్పవాడిని, నేను ఇది, నేను అది అని భావిస్తున్నంత కాలం, నా స్వస్వరూపం తెలియబడదు. ఈ కారణం వల్లనే, యోగులు, మునులు తాము ఏమీ ప్రత్యేకమైన వారము కామని భావించేవారు. భగవాన్ పేదల్లో పేదగా జీవితాన్ని గడిపేవారు. తాను ఎవరు అన్నది, అడిగితే గాని చెప్పేవారు కాదు కూడ. ఆయన అసాధారణత, అతి సాధారణ నడతలోనే ఉంది. మనం కొంత గుప్తత, ఏకాంతము కావాలని కోరుకుంటాం. భగవాన్ అలాగ ఎప్పుడూ ప్రవర్తించలేదు. ఆయన గొప్ప నమ్రత కారణంగా ఎవరైనా, ఎప్పుడైనా రాగలిగేవారు.

## హోదాతోటి బాధ్యతలు

ఇక ఒక ఉద్యోగంలో ఉన్నప్పుడు మనకు ఇవ్వబడిన హోదాను అనుసరించి, ఫలానావాడినని, ఈ విధంగా ముఖ్యుడని చెప్పుకోవలసి వస్తుంది, తప్పదు. హోదాకు తగిన బాధ్యతలను చేయక తప్పదు. ఇరవై నాలుగు గంటలూ, అలా ఉద్యోగానికి తగిన విధంగా నడచుకొని హోదాకు న్యాయం చేయాల్సిందే. ఉద్యోగరీత్యా వచ్చిన అధికారాన్ని ప్రదర్శిస్తూనే, వ్యక్తిగతంగా తాను ప్రత్యేకించి ఏమీ కాను, సామాన్యుడినే అన్న భావన కలిగి వుండాలి. అధికార హోదాను తెలియబరచినప్పుడు ఇతరుల ప్రవర్తనలో మార్పులు చూడగలుగుతాం. అలాగే దుస్తులు అతి సామాన్యంగా వున్నవి ధరించి వీధిలోకి వెళ్ళినప్పుడు కూడ అలాంటి పరిస్థితి ఏర్పడుతుంది. అంటే అధికార హోదాను ప్రదర్శించినప్పుడే, ఇతరులు గౌరవప్రదంగా చూడగలుగుతారని తెలుస్తుంది.

## హోదా, అర్హత

ఒక పండితుడు పూర్తిగా సీదాసాదా జీవితాన్ని గడుపుతుండే వాడు. ఒకరోజు రాజు రాజలాంఛనాలతో ఉత్సవంగా వెళుతున్నప్పుడు ఆ పండితుడిని ఎవరో రాజుకు పరిచయం చేశారు. ఒక ఐదు నిమిషాలు అతనితో మాట్లాడి రాజు అతడిని తన మందిరానికి భోజనానికి ఆహ్వానించాడు. మీరు గొప్ప పండితులు, మీతో మాట్లాడాలని వుంది అన్నాడు. ఆ ప్రక్క రోజు పండితుడు రాజభవనానికి వెళ్ళాడు. ఒంటి మీద చొక్కా లేకుండ పంచె మాత్రం

కట్టుకుని వెళ్ళిన పండితుని రాజుగారు స్వయంగా ఆహ్వానించాడని నమ్మిన తరువాత, ఆలోచించి, చొక్కా తొడుక్కుని మళ్ళీ రమ్మన్నారు. పండితుడు అలాగే చొక్కా వేసుకుని తిరిగి వచ్చాడు. అతడిని లోనికి వెళ్ళనిచ్చారు.

రాజుతో దీర్ఘ చర్చ అనంతరం భోజన కార్యక్రమం మొదలైంది. తినడానికి మొదలుపెట్టే ముందు ఆ పండితుడు రాజును ఒక అనుమతి కోరాడు. పండితుడు తన చొక్కాను విప్పి ఆకు ప్రక్కన పెట్టి, దానికి సాష్టాంగ నమస్కారం చేశాడు. వింతగా చూసిన రాజు, కారణం అడిగితే, తాను రాజుగారితో కలిసి భోజనం చేయగలిగిన అర్హత తన పాండిత్యం వల్ల కాదనీ, ఆ చొక్కా వల్ల కలిగిందని అన్నాడు. సారాంశం ఏమిటంటే, మన అధికార హోదాను, సమాజంలో స్థానానికి ఎక్కువ ప్రాముఖ్యతను ఇస్తాము, వ్యక్తుల నిజమైన విలువలకు కాదు. అలాంటి సన్నిహితత్వం తమ స్థాయిని పెంచుతుందని భావిస్తారు. చివరకు హోదాయే పై చేయి సాధిస్తుంది. మన జీవితాలలో స్పర్థలకు కారణం కూడ ఇలాంటి దృక్పథాన్ని పెంపొందించుకోవడమే. ఈ స్పర్థ సమాజంలోని వ్యక్తులకు మాత్రమే పరిమితం కాదు. కుటుంబంలోని సభ్యుల మధ్య కూడ అలాంటి పరిస్థితి చోటు చేసుకొంటోంది. జ్ఞానులు ఇటువంటి విషయాలకు దూరంగా ఉంటారు.

* * * *

# శ్రీ భగవాన్ నా జీవితంలోకి ఎలా ప్రవేశించారు?

(గత సంచిక తరువాయి) బి. రవికృష్ణ శర్మ

ఇదిలా ఉండగా 2012వ సంవత్సరం ప్రారంభంలో, మా నాన్నగారు నన్నొక రోజున బ్యాంకు నుండి ఒక అప్లికేషను ఫారం తెమ్మనా చెపితే, నేను ఇంకొకటి తెచ్చాను. సమయం కోసం వేచి చూస్తున్న మా నాన్నగారు ఈ సందర్భాన్ని అడ్డు పెట్టి తీవ్రంగా మందలించటం మొదలుపెట్టారు. ఉద్యోగం లేదు. సంపాదన లేదు, జులాయిగా తిరుగుతున్నావు. నీ లక్ష్యం ఏంటో తెలియదు అంటూ మందలిస్తూ ఉండటంతో ఎదురుగా ఉన్న దినపత్రికను తీసుకొని వారి చూపుల నుండి తప్పించుకోవటానికి అడ్డుపెట్టు కొన్నాను. అలా అడ్డుపెట్టుకొన్నప్పుడు కాకతాళీయంగా ఆ దిన పత్రికలో ప్రచురితమైన ఒక ఉద్యోగ ప్రకటన మీద నా దృష్టి పడింది. ఆ ప్రకటన చిన్మయా మిషన్ వారిది, వారికొక భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుని అవసరం ఉన్నదని, అర్హత కలిగిన వ్యక్తులు దాని కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆ ప్రకటన సారాంశం.

మా నాన్నగారు సంపాదన లేదు, ఉద్యోగం లేదన్నారన్న ఉక్రోషంతో ఆ ఉద్యోగానికి దరఖాస్తు పూర్తి చేసుకొని వ్యక్తిగతంగా విద్యాలయానికి వెళ్లి ఇవ్వాలని బయలుదేరి శ్రీరమణ కేంద్రం దగ్గర్లోని కూడలి వద్దకు వచ్చేటప్పటికే అన్నమాచార్యుల వారి ఒక సంకీర్తన నా మదిలో మెదిలింది. అదేమిటంటే 'మనుజుడై పుట్టి మనుజుని సేవించి అనుదినము దుఃఖ మొందనేల? ఆ కీర్తన నా మదిలో మెదలగానే అక్కడినుండి బేగంపేట్‌లోని చిన్మయా

విద్యాలయానికి వెళ్ళటానికి మనసొప్పక నాకు మంత్రాన్ని ఉపదేశించిన సిద్ధాంతిగారింటికి వెళ్లి ఆ రోజంగా వారితోనే గడిపేశాను. అలా రెండు రోజులు గడిచిన తరువాత ఏదో తెలియని శక్తి నన్ను చిన్మయా విద్యాలయానికి తీసుకొని వెళ్లి దరఖాస్తు చేసుకొనే విధంగా చేసింది.

ఒక వారం తరువాత ఆ విద్యాలయం నుండి ఒక లెటర్ వచ్చింది. అందులో వారు, కమిటీ సభ్యులతో ముఖాముఖి సమావేశానికి హాజరు కావలసినదిగా కోరారు. అయిష్టంగానే ఆ సమావేశానికి హాజరై ఎంతో నిర్లక్ష్యంగా సమాధానాలు ఇచ్చాను. అలా నిర్లక్ష్యంగా సమాధానాలు చెపితే నాకు ఉద్యోగం ఇవ్వరు అని తెలిసి కావాలని అలా సమాధానాలు చెప్పాను. అయినా అదేమీ ప్రారబ్ధమో దరఖాస్తు చేసుకొన్న వారందరిలో నేనే వారికి నచ్చిన వ్యక్తినని నన్ను ఉద్యోగంలో చేరమన్నారు. దీని నుండి కూడా తప్పించుకోవటానికి, అధిక భత్యాన్ని చెల్లిస్తే నేను చేరతానన్నప్పుడు నేనడిగిన భత్యానికి కొంత తగ్గించి ఇస్తామని నన్నక్కడ చేరటానికి ఒప్పించారు. అక్కడ చేరాననే గాని, ఏ మాత్రం అవకాశం వచ్చినా ఉద్యోగం వదిలివేయాలనే ఆలోచన నా మదిలో మెదులుతూ ఉండేది. అలా ఒక సంవత్సరం గడిచిన తరువాత అంటే 2013వ సంవత్సరం జూన్ నెలలో ఉద్యోగంలో చేరిన నా సహోద్యోగి ఆగష్టు నెలలో నాలుగు రోజులు వరుసగా సెలవలొస్తున్నాయి కదా మనం శ్రీరమణాశ్రమం వెళ్దామా అని అడిగారు. నేను అలాగే వెళదామని అన్నాను. కానీ మరుసటిరోజు తనొచ్చి, తన తల్లితండ్రులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారని అందులో ఒకటి ఖరారయ్యే అవకాశం

ఉన్నది కనుక దసరా సెలవులలో శ్రీరమణాశ్రమం వెళదాం అని నాతో అన్నారు. నేను ఫర్వాలేదు సర్, అలానే కానిద్దాం అని చెప్పి, ఈసారి ట్రైన్ టికెట్లు నేను బుక్ చేస్తానని చెప్పి అక్టోబర్ 7వ తారీఖున శ్రీ రమణాశ్రమం చేరేటట్టు టికెట్లను బుక్ చేసుకొన్నాము. ఆశ్రమం వారు మాకు అక్కడ మూడు రోజులు ఉండటానికి అవకాశం ఉన్నది అనే మెసేజ్‌ను మెయిల్ ద్వారా తెలియచేశారు.

మేమింకొక్క వారంలో బయలుదేరుతామన్న సమయంలో, మొదటి పరీక్ష ఎదురైయ్యింది. అతను, సర్ నేను రావటం లేదు, పెళ్లి సంబంధం ఖరారైనందున పెళ్లి బట్టలు కొనుక్కోవాలి, నేను రాలేను అని అన్నారు. దానికి నేను, సర్ మీరు రాకపోయినా, నేను నా ప్రయాణాన్ని వాయిదా వేసుకోలేను అని చెప్పాను. అక్కడి నుండి ఒక్కొక్క పరీక్ష మొదలయ్యింది. కానీ ఆ పరీక్షను కూడా దాటించేవాడు ఆ భగవంతుడే. ఆ భగవంతుడే గురువు రూపంలో కూడా వస్తాడు. కానీ ఈ పరీక్షలను ధృఢసంకల్పంతో ఎదుర్కొంటే గురువుని లేదా దైవాన్ని దర్శించవచ్చు అనేది నాకు కలిగిన అనుభవం. అదే నేనిక్కడ పంచుకోదలచాను.

రెండవ పరీక్ష మా విద్యాలయం వారు ప్రతీ సంవత్సరం విద్యార్థుల కొరకు విజ్ఞాన యాత్రను ఏర్పాటు చేస్తారు. ఆ విద్యార్థులను తీసుకొని వెళ్ళే ఉపాధ్యాయుల పేర్లలో నా పేరు కూడా జతచేశారు. అంటే నేను ఆ విద్యార్థులను ఆ యాత్రకు తీసుకొని వెళ్లి, తిరిగి జాగ్రత్తగా ఆ పిల్లల తల్లితండ్రులకు ఒప్పచెప్పాలి. అది నా కర్తవ్య నిర్వహణలో ఒక భాగం. ఆ యాత్ర అక్టోబర్ 1వ తారీకు నుండి 6వ తారీకు వరకు జరిగేలా

నిర్ణయించారు. అంటే మరల హైదరాబాద్‌కు తిరిగి 7వ తారీకున వస్తాం. కానీ అదే రోజున నేను తిరువణ్ణామలైలో ఉండాలి. ఇప్పుడెలా అని ఆలోచించి 6వ తారీకు వరకూ విద్యార్థులతోనే ఉండి, ఆ రోజు మధ్యాహ్నం మా ప్రిన్సిపాల్ గారిని ఇలా అభ్యర్థించాను. సర్, నేను విద్యార్థులను రైలెక్కించే వరకు ఉంటాను. విద్యార్థులను వారి వారి తల్లితండ్రులకు ఒప్పగించే బాధ్యతను ఇతర ఉపాధ్యాయులకు ఒసగవలసినదిగా అభ్యర్థించాను. అందుకు వారు నామీదున్న గౌరవంతో దానికి అంగీకరించారు. కానీ నాకొక హెచ్చరిక చేశారు. అదేంటంటే రవికృష్ణ ఇప్పుడు తెలంగాణాను, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి విభజించాలనే పోరాటం తీవ్రంగా ఉన్నది. అన్నిచోట్ల రైళ్ళను, బస్సులను తగల బెడుతున్నారు. నిన్ననే మనం వెళ్ళేటటువంటి రైలులో ఒక బోగిని తగులబెట్టారుట, అలానే అన్ని ప్రాంతాలలోని బస్సులను, రైళ్ళను త్రిప్పటం ఆపివేస్తున్నారని, ఇది ఇలాగే కొనసాగితే, నువ్వు మధ్యలోనే ఇరుక్కుపోయి ఇబ్బంది పడతావు. అందుకని అన్నీ సర్దుకొన్న తరువాత తిరువణ్ణామలై వెళ్ళవచ్చు కదా అని అన్నారు.

కానీ అప్పటి నా మానసిక పరిస్థితి దేన్నీ వినే స్థితిలో లేదు. వారితో నేనన్నాను, సర్ ఏమైనా కానీ, నేను మరల తిరిగి రాకపోయినా ఫర్వాలేదు. నా ఉద్యోగం పోయినా నేను బాధపడను. కానీ నేను సంకల్పించిన ఈ యాత్ర చేసి తీరవలసిందే అని అనటంతో, వారు కాదనలేక మీ ఇష్టం అని ఊరుకున్నారు. అలా అందర్నీ సాయంత్రం 6.30 గంటలకు బెంగుళూరు నుండి హైదరాబాద్‌కు వెళ్ళే రైలెక్కించి నేను 8.30 గంటలకు బెంగుళూర్

నుండి కాట్పాడి వెళ్ళే పాసింజర్ రైల్ గురించి వేచి ఉన్నాను. 8.30 గంటలకు బయలుదేరవలసిన రైలు పట్టాల మీదకు వచ్చింది, కానీ నేను ఎక్కవలసిన బోగీ అందులో కనిపించలేదు.సమయం దాటి పోతున్నది. బోగీ కనిపించటం లేదు అనే కంగారు నాలో మొదలైంది. మూడుసార్లు ఆ చివరి నుండి ఈ చివర వరకు మొత్తం రైలంతా వెతికాను కానీ నేనెక్కవలసిన బోగీ కనిపించటం లేదు. సమయం 8.30 కావస్తున్నది, అప్పుడు అటుగా వస్తున్న టి.సి.ని అయ్యా ఈ రైలులో నాకు కేటాయించిన బోగీ కనిపించటం లేదు. అది అసలు ఉన్నదా? అని అడిగితే ఆయన, ఇప్పుడే ఇంజిన్ వెనకాల ఆ బోగీని జత చేశారు. మీరక్కడకి వెళ్ళండి అని అన్నారు. ఇక్కడ నేనొక విషయం చెప్ప దలచాను. అదేమిటంటే నేను అంత వరకు ఎప్పుడు కూడా ఒంటరిగా ఎక్కడికి ప్రయాణం చేయలేదు. నేనెక్కడికి వెళ్ళినా, నాతో కూడా ఉన్నవారే నా సౌకర్యాల నన్నింటిని చూసుకొనేవారు. కనుక నేనెప్పుడూ దేన్ని గురించి పెద్దగా పట్టించు కొనేవాణ్ని కాదు. ఇది నాకు మొదటి అనుభవం. కాబట్టి కొంత ఆందోళనకు గురైనాను. తెల్లవారు జామున 2.30 గంటలకు కాట్పాడి చేరుకొని 4.45 కు విల్లుపురం వెళ్ళే పాసింజరు రైలు టికెట్‌ను తీసుకొని ఫ్లాట్‌ఫారం మీద కూర్చొని భగవద్గీత చదువుకొంటూ ఉండగా, 4.30 గంటల సమయంలో ఓ ఇద్దరు పెద్ద వారు అదే ఫ్లాట్‌ఫారం మీద కొంచెం దూరంలో కూర్చొని తెలుగులో మాట్లాడుకొంటున్నారు. అది గమనించి వారి దగ్గరకు వెళ్లి అయ్యా, మీరెక్కడికి వెళ్తున్నారు? అని అడిగితే వారు తిరువణ్ణామలైలోని శ్రీరమణాశ్రమం అని అన్నారు. దాంతో నా

ప్రాణం లేచొచ్చినట్టయింది. నేనప్పుడు వారిని విల్లుపురం వెళ్ళే పాసింజర్ రైలు ఎప్పుడొస్తుంది? అని అడిగితే వారు మన ముందున్నది అదే అని చెప్పి, నన్ను కూడా వారితో రమ్మనటంతో ఒకే బోగీలో కూర్చొన్నాము. నేను వారితో, అయ్యా, నాకు తిరువణ్ణామలై గురించి కానీ, శ్రీరమణాశ్రమం గురించి కానీ ఏమి తెలియదు. నేను మొదటిసారి అక్కడికి వస్తున్నాను కాబట్టి, మీరు నాకు కొంచం మార్గనిర్దేశం చేస్తారా అని అడిగితే వారెంతో సహృదయంతో, నాయనా నీవు మాతోపాటే ఆటోలో వచ్చేద్దువు కానీ, అలానే మేము స్నానం చేసిన తరువాత 9 గంటలకు గిరి ప్రదక్షిణకు బయలుదేరుతాము. అప్పుడు నిన్ను కూడా మాతోపాటే తీసుకొని వెళ్తామని చెప్పి నా ఫోన్ నెంబరు తీసుకొని, సరిగ్గా 9 గంటలకు ఫోన్ చేశారు. అలా మేము గిరి ప్రదక్షిణ మొదలు పెట్టి 12 గంటల కల్లా అడి అణ్ణామలై చేరుకొనేటప్పటికి ఎండ తీవ్రత ఎక్కువవటంతో కాళ్ళు బాగా కాలటం మొదలయ్యాయి. దాంతో అక్కడి నుండి ఆటో తీసుకొని కుబేర లింగం, మోక్ష ద్వారం, ఈశాన్య లింగం, ఇంద్ర లింగం మరియు అగ్ని లింగాలను దర్శించుకొని ఆశ్రమానికి చేరుకొనేటప్పటికే మధ్యాహ్నం ఒంటిగంటయ్యింది. వారప్పుడు నాయనా మాకు ఓపిక లేదు. భోజనం చేసి కాసేపు విశ్రాంతి తీసుకొన్న తరువాత స్కందాశ్రమం, విరుపాక్ష గుహను దర్శించుకొంటాం అని చెప్తే ఫర్వాలేదు సర్ మీరు విశ్రాంతి తీసుకోండి అని చెప్పి, వారికి వీడ్కోలు పలికి నేను ఒక్కణ్ణిగా స్కందాశ్రమం, విరుపాక్ష గుహను దర్శించటానికి 1.30కు బయలుదేరాను. కొండ ఎక్కుతుంటే బాగా దాహం వేయటం

మొదలైంది. నాతో కూడా తెచ్చుకొన్న నీళ్లు అయిపోయాయి. మిట్ట మధ్యాహ్నం కావటంతో ఆ దారిలో ఎవ్వరూ కన్పించలేదు. అప్పుడు నా మదిలో అర్థాంతరంగా ఒక ఆలోచన మెదిలింది. అదేంటంటే భగవాన్‌కు అన్ని తెలుసని అంటారు కదా! అటువంటప్పుడు ఇప్పుడు, ఇక్కడ తియ్యటి నీరును ఇప్పించగలరా? అని అనుకొని కొన్ను అడుగులు ముందుకు వేసినప్పుడు కొంత దూరంలో తుప్పలలో నుండి అలికిడి వినిపించటంతో, ఈ నిర్జన ప్రదేశంలో ఎవరుంటారబ్బా అని అనుకొంటూ అటుగా నడవటం మొదలు పెట్టాను. అప్పుడు నాకొక దృశ్యం కనిపించింది. అక్కడ ఒక వ్యక్తి ఆ తుప్పలలోని చెట్లకు నీళ్ళు పెడుతున్నాడు. నేనప్పుడు ఆ వ్యక్తిని నాకు దాహమేస్తోంది. ఈ నీళ్లు తియ్యగా ఉంటాయా అని తెలుగు లోనే అడిగాను. నాకు తన్నీర్ అన్న ఒక్క తమిళ పదం తప్ప ఇంకేమీ రాదు. కానీ ఆ వ్యక్తి ఇలా అన్నాడు. నేనొక లారీ క్లీనర్‌ను నాకు కొంచెం కొంచం తెలుగు వచ్చు, ఇవి స్వీట్ వాటర్ అని, నీళ్ళు పెడుతున్న ఆ పైప్ తోనే నా బాటిల్ నింపాడు. ఆ నీళ్ళు ఎంతో తియ్యగా ఉన్నాయి. అలా దాహం తీర్చుకొని మరల నడవటం మొదలు పెట్టి కొన్ని అడుగులు వేసిన తరువాత వెనుకకు తిరిగి అతనికి ధన్యవాదాలు చెబుదామని చూస్తే అక్కడెవ్వరూ కనిపించ లేదు. అప్పటికి నా మట్టి బుఱ్ఱకింకా తట్టలేదు. నేననుకొన్నాను, ఆ వ్యక్తి అక్కడ నుండి ఇంకొక చోటికి వెళ్లిపోయి ఉంటాడనుకొని స్కందాశ్రమం, విరుపాక్ష గుహను దర్శించుకొని శ్రీరమణాశ్రమానికి చేరుకొనేటప్పటికే సాయంత్రం 4.30 గంటలయ్యింది. అప్పుడే ప్రతీ సాయంత్రం జరిగే తమిళ గ్రంథ పఠనం పూర్తై, ఆంగ్ల గ్రంథ

పఠనం మొదలయ్యింది. ఆ గ్రంథ పఠనంలో వివిధ భక్తులు భగవాన్‌తో ఏమేమి సంభాషించారో తెలియచేస్తున్న సందర్భంలో కే.కే. నంబియార్ గారికి వచ్చిన కలను గురించి ప్రస్తావన వచ్చింది. అప్పుడు మళ్ళీ నా మదిలో ఒక ఆలోచన మెదిలింది. ఈ కలలు రావటం, అవి సత్యమైనాయనటం ఒక కల్పిత కథ అయి ఉంటుంది. ఒకవేళ గనుక భగవాన్ యొక్క ఉనికి ఇప్పటికీ ఉన్నట్లయితే, శ్రీ భగవాన్‌ను దర్శించిన వారిని లేదా వారి కుటుంబ సభ్యులను నేను చూడాలి అనే ఆలోచన నా మదిలో మెదిలింది. ఎందుకంటే భగవాన్ దేహం చాలించి అప్పటికి ఇంకా63 సంవత్సరాలే అయ్యింది కనుక ఒక 75 సంవత్సరాల వ్యక్తి కనుక బ్రతికి ఉంటే, ఆ వ్యక్తి గనుక భగవాన్‌ను దర్శించిన లేదా వారితో మాట్లాడిన జ్ఞాపకాలు ఉంటాయి కదా, అని అనుకొని, అప్పటి నుండి నేను ఎవరైనా ముదిమి వయసులో ఉన్నవారిని, భగవాన్‌ను దర్శించిన వారిని చూడలేనా అని వెతకటం మొదలుపెట్టాను. అలా వెతుకుతూ ఉంటే సరిగ్గా అదే రోజు రాత్రి పూట భోజనాలు అయిన తరువాత భోజనశాలకు గోలక్ష్మి సమాధికి దగ్గరలో ఉన్న అరుగుల మీద కొంత మంది నా ప్రక్కనే కూర్చొని తెలుగులో మాట్లాడుకోవటం వినిపించింది. ప్రక్కకు తిరిగి చూస్తే ఒక పెద్దాయన, సుమారు 70 నుండి 75 సంవత్సరాలు ఉంటాయి. నేను వారితో మాట కలిపి మీ పేరేమిటని అడగటంతో వారు నా పేరు గ్రిద్దలూరి క్రిష్ణమూర్తి అని అన్నారు. నేనప్పుడు గ్రిద్దలూరి సత్యనారాయణ గారు మీకేమౌతారని అడిగితే, వారు మా నాన్నగారు అని సమాధానం చెప్పారు. మద్దాలి సుబ్బారావు గారేమౌతారని

అడిగితే మా బావగారవుతారని అని అన్నారు. అప్పటికి గాని నాకర్థమవలేదు. నేనుకొన్న ప్రశ్నలకు భగవాన్ ఈ విధంగా సమాధాన మిస్తున్నారని.

ఆ మరుసటి రోజు ఉదయం క్రిష్ణమూర్తిగారిని కలిసి మాట్లాడుతున్నప్పుడు వారి సతీమణి శ్రీమతి జయలక్ష్మిగారు అక్కడి కొచ్చి ఏమబ్బాయ్ ఎక్కడ నుండి వచ్చావ్? అని అడిగారు. నేను హైదరాబాద్ నుండి వచ్చానండి అని అంటే, నువ్వు ప్రతీ ఆదివారం శ్రీరమణకేంద్రంలో జరిగే సత్సంగాలలో పాల్గొనవలసినదిగా నాకు సూచించారు. అలా ఆ మరుసటి ఆదివారం నుండి శ్రీరమణ కేంద్రం రావటం మొదలుపెట్టాను.

శ్రీరమణ కేంద్రంలో గ్రంథాలయం ఉన్నదని దాంట్లో 200 రూపాయలు కడితే సభ్యత్వ నమోదు జరపబడుతుందని తెలుసు కొని దాని ద్వారా మనకు పుస్తకాలు ఇస్తారని అర్థమవటంతో, గ్రంథాలయంలో సభ్యుడనైన తరువాత, ప్రతీ రోజు సాయంత్రం నా స్కూల్ డ్యూటీ అయిన తరువాత 4 గంటలకల్లా శ్రీరమణ కేంద్రం చేరుకొని రాత్రి 8 గంటల వరకు మొదటి అంతస్థులోని స్టోర్‌రూమ్‌కు ప్రక్కన ఉన్న భగవాన్ పెద్ద సైజు ఫోటో దగ్గర, భగవాన్ పాదాల చెంత క్రింద కూర్చొని, భగవాన్‌కు సంబంధించిన అన్ని పుస్తకాలను చదివేవాడిని. అలా చదువుతున్నప్పుడు నాలో అంత కాలం చెలరేగిన బడబాగ్ని అతిశీఘ్రంగా చల్లారటం మొదలై, అతి కొద్ది రోజులలోనే నా మనసు ప్రశాంత స్థితిని చేరుకొన్నది. ఆ ప్రశాంతత యొక్క ప్రభావం ఎంత తీవ్రమైనదంటే ఎవరైనా వచ్చి నన్నేమన్నా అడిగినా నా నోట మాట రాకపోయేది. ఆలోచనలన్నీ

స్తంభించి పోయేవి. ప్రశాంతత నా మనసులో రాజ్యమేలుతుండేది. ప్రతీ రోజు అక్కడి నుండి వెళ్ళే చివరి వ్యక్తిని నేనే. అతి కష్టం మీద అడుగు తీసి అడుగు వేసేవాడిని. అప్పుడున్న వాచ్‌మెన్ రాజు వచ్చి సర్ ఇక తాళం వేస్తాం, మీరు బయలుదేరాలి అని అన్నప్పుడు అతి కష్టం మీద అక్కడినుండి కదిలేవాడిని. గ్రంథాలయంలో కొంత మంది భక్తులు చర్చలలో పాల్గొనాలని నన్ను ఆహ్వానించేవారు. అప్పుడు నేను, భగవాన్ అంతా ఇచ్చేశారు కదా! ఇంకా మాట్లాడటానికి ఏముంది? వీళ్ళంతా ఆ ప్రశాంతతను ఆస్వాదించ కుండా ఇంకా ఎందుకు మాట్లాడుతున్నారని అని అనుకొనేవాడిని.

అలా అప్పటినుండి ప్రతీ సంఘటనలో భగవాన్ నన్నెలా నడిపిస్తున్నారో చాలా దగ్గరగా గమనిస్తూ ఉన్నాను. ఇక్కడ ఒక సంఘటన భగవాన్ సన్నిధిలో జరిగినది గుర్తుకు వస్తున్నది. శ్రీ నటనానంద గారు ఒక రోజు భగవాన్ సన్నిధిలో కూర్చొని ఉన్నప్పుడు శ్రీకావ్యకంఠ గణపతి ముని, శ్రీ కపాలి శాస్త్రి, శ్రీ విశ్వనాథస్వామి మొదలైన వారు సంస్కృతంలో వివిధ గ్రంధాలలో ఉన్న విషయాలను గురించి గొప్ప చర్చ చేసుకొంటున్నారు. అదంతా వింటున్న శ్రీ నటనానందగారి మదిలో ఒక భావన ఏర్పడింది. వీరంతా సంస్కృతంలో ఉన్న గొప్ప గొప్ప గ్రంథాలలోని విషయాలను ఎంతో విశ్లేషించి చర్చిస్తున్నారే! వీరిలా మనకెప్పుడు జ్ఞానోదయం కలుగుతుంది? ఆ సంస్కృత గ్రంథాలను చదివే దెప్పటికో, వాటిని అర్థం చేసుకొనేదెప్పటికో, అని అనుకొని, ఇలా ఐతే నాకెప్పటికి ముక్తి కలుగుతుందోనని బాధపడుతూ భగవాన్

ఎదుట కన్నీరు కార్చారట. ఇదంతా గమనిస్తున్న భగవాన్ వారంతా వెళ్ళిపోయిన తరువాత శ్రీ నటనానందతో ఎందుకు కన్నీరు కారుస్తున్నారు? అని అడిగితే, వారంతా గొప్ప గొప్ప విషయలను సంస్కృతంలో అంత బాగా చర్చించుకొంటున్నారు. వారేమి మాట్లాడుకొంటున్నారో నాకొక్క ముక్క అర్థం కావట్లేదే, ఇలా ఐతే నేనెప్పటికి ఈ గ్రంథాలనన్నింటిని క్షుణ్ణంగా అర్థం చేసుకోగలనో, నాకెప్పటికి ముక్తి కలుగుతుందో అని బిగ్గరగా ఏడవటం మొదలు పెట్టారట. అది చూసి భగవాన్ ఇలా అన్నారట. నేనిక్కడికి వొచ్చి నప్పుడు, నేనేమి సంస్కృతం నేర్చుకొన్నానని? నాకొక్క ముక్క కూడా రాదే అని చెప్పి ఎందుకలా బాధపడతారు? పులి నోట్లో పడ్డ మాంసపు కండ ఎలా తప్పించుకోలేదో అలా గురువనుగ్రహానికి పాత్రుడైన వ్యక్తి కూడా తప్పించుకోలేడు అని ఆశ్వాసన ఇచ్చారట.

దాన్ని బట్టి నాకిప్పుడనిపిస్తోంది, మనందరం శ్రీ భగవాన్ మార్గంలో నడుస్తున్నామంటే, అది మన గొప్పతనం కాదు, భగవాన్ యొక్క అనుగ్రహం అని, ఎందుకంటే మన మనస్సు ఎంతో చంచల మైనది. అటువంటి మన మనసును మనకు తెలియకుండా, వారి వైపునకు తిరిగే విధంగా మన చేత చేయిస్తున్న భగవాన్‌కి ఏమిచ్చి ఋణం తీర్చుకోగలం? అందుకే భగవాన్‌ను, ఈ ప్రాపంచిక వ్యవహారాలలో మన మనస్సు నిమగ్న మవకుండా వారి పాదాల చెంత నిమగ్నమయ్యే విధంగా పరిపూర్ణ అనుగ్రహాన్ని వర్షించ వలసిందిగా ప్రార్థిస్తూ...

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు
## (శ్రీదేవరాజ ముదలియార్)

(గత సంచిక తరువాయి) అనువాదం: జి. శ్రీహరిరావు

శ్రీ భగవాన్ గిరి ప్రదక్షిణ గురించి చెప్పవలసిన యింకొక విశేషము కోతులకు సంబంధించినది. వారు కొండ మీద నివసించుట మొదలుపెట్టిన రోజుల నుండి శ్రీ భగవాన్‌కు కోతుల గురించీ, వాటి జీవన విధానము గురించీ, పాలనా పద్ధతుల గురించీ క్షుణ్ణముగా తెలుసును. శ్రీ భగవాన్ సమత్వ భావము కేవలమూ సిద్ధాంతాలకి పరిమితం కాలేదు. అది చాలా దృఢమైనదీ-ఆచరణీయమూ! వారు జంతువులను కూడా సమభావముతోనే చూసేవారు. ఒకసారి కోతులు శ్రీ భగవాన్ పట్ల తమ కృతజ్ఞత ప్రదర్శించాయి. ఆ సంఘటన మరచిపోలేనిది. శ్రీ భగవాన్ భక్త సమూహముతో గిరి ప్రదక్షిణకు వెడుతున్నారు. టౌనుకు యింకా మైలు దూరం వుండగానే వారందరకు బాగా ఆకలీ, దాహమూ కలిగాయి. ఆ రోజు మండుటెండతో కాలిపోతోంది. దగ్గరలో ఎక్కడా నీళ్ళు లేవు. ఇంతలో ఎక్కడనించోఒక కోతిమూక వచ్చి అత్తి వృక్షాన్ని ఒకదాని నెక్కి కొమ్మలు వూపసాగాయి. పండిన అత్తి పళ్ళు గుత్తులు గుత్తులుగా నేలమీదకు రాలాయి. భక్తులందరూ పళ్ళను తృప్తిగా తిని ఆకలీ, దాహమూ తీర్చుకున్నారు. భక్తుల పాట్ల గురించి వాటికెలా తెలిసింది? సమయానికి ఆ స్థలానికి వచ్చి వాళ్లకు పళ్ళు ఎలా అందించాయి? ఈ ప్రశ్నలకు మనము సమాధానము చెప్పలేము. తన కుమారుడైన శ్రీ భగవాన్ పట్ల వున్న వాత్సల్యముతో శ్రీ అరుణాచలేశ్వరుడే మళ్ళీ వచ్చి ఆదుకున్నారేమో! శ్రీ భగవాన్

పాడిన ‘‘నన్ను ఇక్కడకు రమ్మని పిలవ లేదా? వచ్చి నా అవసరాలను తీర్చి కాపాడుము’’ పాటకు అరుణాచలేశ్వరుడే స్పందించి తన బిడ్డను ఆదుకున్నాడనుకోవాలి.

నేను ఆశ్రమంలో శాశ్వతంగా నివాస మేర్పరుచుకుని వచ్చినాక, నేను చేయగల సేవ ఎంతో కొంత ఆశ్రమానికి చేయాలని పించింది. కానీ నేను చేయగల పనేమిటో నాకు తోచలేదు. అందువల్ల ఆ ఆలోచన విరమించుకున్నాను. కానీ ఒకరోజు శ్రీ భగవాన్‌తో ఆశ్రమగ్రంథాలయమును ఒక పరిచారకుని సహాయముతో అప్పటిదాకా నడుపుతున్నట్లు ముందు ముందు నడపడం సాధ్యము కాదని చెప్పారు. ఆశ్రమానికి వచ్చే భక్తుల సంఖ్య పెరిగినదనీ, పుస్తకాలు కూడా బాగా ఎక్కువయ్యాయనీ అందువల్ల గ్రంథాలయానికి పూర్తి సమయం వెచ్చించే ఒక నిర్వాహకుడు కావాలని సూచించాను. నేనీ మాటలు చెబుతున్నప్పుడు శ్రీ చాడ్విక్కు అక్కడే వున్నారు. నా మాటలు విని ఆయన, ‘‘ఆ బాధ్యత మీరే యెందుకు తీసుకోకూడదు?’’ అని నన్ను ప్రశ్నించారు.

శ్రీ భగవాన్ ఆయనను వెంటనే సమర్థించి, ‘అవును! మీరే ఎందుకు చేయకూడదు?’ అన్నారు.

ఇలాంటి పనులు నేను బాగానే చేయగలననే నమ్మకంతో నేను వెంటనే ఒప్పుకున్నాను. నేను కొన్ని సంవత్సరాలు గ్రంథాలయాధికారిగా పనిచేశాను. కొంతకాలానికి శ్రీ భగవాన్ పరిచారకుడు శ్రీ టి.ఎస్. రాజగోపాలయ్యర్ నియమింపబడ్డారు. సర్వాధికారి

వారినే లైబ్రరీ పనులు కూడా చూడమనడంతో నేనా పని మాను కున్నాను. అంతేకాదు. నేను రమణాశ్రమవాసిగా వున్న నాలుగు సంవత్సరాలూ, హాలులో శ్రీ భగవాన్‌కు అధికారిక తర్జుమాదారుగా పని చేయాల్సి వచ్చేది. ఇంగ్లీషులో ప్రశ్నలు వేసే భక్తులకు శ్రీ భగవాన్ యిచ్చే తమిళ సమాధానాలను నేను సరిగ్గా తర్జుమా చేయకపోతే శ్రీ భగవాన్ కోప్పడేవారు. నేను మాట్లాడే ప్రతి మాటా శ్రీ భగవాన్ చాలా జాగ్రత్తగా వినేవారు. ఒక్కోసారి, తమిళ గ్రంథాల నుండీ, కొన్ని పాటలనూ, గద్య భాగాలను ఆంగ్లంలోనికి తర్జుమా చేయమనే వారు శ్రీ భగవాన్.

శ్రీ భగవాన్ నన్ను తర్జుమా చేయమనే వారు అన్న మాటను నేను కొంచెము వివరించాలి. శ్రీ భగవాన్ ఏదైనా పాఠ్యభాగాన్ని అనువాదం చేయించాలి అని అనుకుంటున్నారని తోచినప్పుడు, 'నేను చేస్తాను', అని ముందుకు వచ్చేవాడిని. శ్రీ భగవాన్ ఆమో దించేవారు. నేను చేసిన పనులన్నీ ఇలా చేసినవే. శ్రీ భగవాన్ ఏ పని కూడా ఎవరితోనూ బలవంతంగా చేయించేవారు కాదు. నేను లైబ్రరీ పనులు చూసేటప్పుడు, శ్రీ భగవాన్ ఏదైనా పుస్తకం గురించి ప్రస్తావించినప్పుడు కానీ, ఫలానా పుస్తకంలో ఫలానా అంశం గురించి కానీ, పాట గురించి ఉదహరించినప్పుడుగానీ, నేను చెంగునలేచి, హాలులో, షెల్ఫులలో నుండి గానీ, వేదపాఠశాలలో అలమరలలో (ఆ రోజులలో) పెట్టబడిన పుస్తకముల నుండిగానీ ఆ పుస్తకము తెచ్చి శ్రీ భగవాన్‌కు యిచ్చేవాడిని. "ఎందుకు శ్రమ పడతావు?" అని శ్రీ భగవాన్ మందలించినప్పుడు "శ్రమ యేమీ లేదు. శ్రీ భగవాన్ కృపవల్ల నేనింకా చురుకుగానే వున్నాను. ఇక్కడ

ఖాళీగా, పనిలేకుండా కూర్చున్నా గానీ, దేహము మాత్రం ఆరోగ్యంగానే వున్నది'' అని సమాధానమిచ్చేవాడిని.

తాయుమానువర్ నుండీ, కైవల్యము నుండీ, మరికొన్ని గ్రంథముల నుండీ అక్కడక్కడా కొన్ని పద్యములను అనువదించ టమే కాకుండా భక్తవిజయము నుండీ ఒక సుదీర్ఘమైన గద్యభాగ మును శ్రీమనసుబేదారు అను సందర్శకుల సౌకర్యార్థము ఆంగ్లము లోనికి అనువదించాల్సిన పని పడింది. ఒక సందర్భములో, శ్రీ సుబేదారుగారు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానముగా శ్రీ భగవాన్ భక్త విజయములో శ్రీ జ్ఞానేశ్వర మహరాజ్‌కూ, వారి తండ్రి విఠోబా గారికీ జరిగిన సంవాదమును చదివి వినిపించారు. సంవాదాంశము జ్ఞానసముపార్జనకూ, తపస్సు చేసుకొనుటకూ, అరణ్యవాసమవ సరమా అనునది ఆ సంవాదము. శ్రీ సుబేదారి గారికి చాలా నచ్చి, ఆ పాఠ్యభాగానికి ఆంగ్లానువాదము కావలెనని ప్రార్థించిరి. శ్రీ భగవాన్ సూచన మేరకు నేను అనువదించి శ్రీ భగవాన్ కావలసిన మార్పులు చేసిన తరువాత శ్రీ సుబేదారుగారికి పంపించాను. వారీ అనువాదమును, 'జ్ఞానేశ్వరి' తదుపరి ముద్రణకు అనుబంధముగా ప్రచురించిరి. ఈ సంవాదము యొక్క విశేషమేమన్న, జ్ఞానమార్గ మున పయనించుచున్న వారి దృక్పథమునకూ (తండ్రిగారు), జ్ఞానమునందు ఉపవిష్టులయిన వారి దృక్పథమునకూ (కుమా రుడు) గల బేధము స్పష్టమవుతుంది. ఈ పాఠ్యాంశమును తెలుసు కొన ఆసక్తి గల వారికి ఈ సంవాదము చక్కటి వివరణ యిస్తుంది.

(ఈ రచన శ్రీ రమణాశ్రమము ద్వారా ప్రచురింపబడిన 'మై రికలక్షన్స్ ఆఫ్ భగవాన్ శ్రీ రమణ మహర్షి' అనబడే గ్రంథము నుండి అనువదింపబడినది.)

# శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# శ్రీ ఎమ్.జి. షణ్ముఖం

**మల్లాది ఫణిమాల**

తమిళ భాషలో శ్రీరమణుల జీవిత చరిత్ర మరియు బోధలను గ్రంథస్థం చేసి, ప్రచురించిన వారు శ్రీ ఎమ్.జి. షణ్ముఖం గారు. 1926-27లో శ్రీరమణులు కొలువుతీరిన హాలుని ఈశాన్య మఠాధిపతితో కలిసి నిర్మించడానికి శ్రీ షణ్ముఖం గారు ఎంతో తోడ్పడ్డారు. సంప్రదాయసిద్ధమైన కుటుంబంలో జన్మించి, పెరగటం చేత షణ్ముఖం గారు శాస్త్రాలను అభ్యసించడం, జపం చేయటం, భజనలు పాడటం వంటి భగవత్ సంబంధమైన విధులు చక్కగా నిర్వర్తించేవారు. అంతేగాక త్రిసంధ్యలలో పూజ కూడా చేసేవారు. మానవ జన్మ ఉత్కృష్టమైన జన్మమనియు, జీవన్ముక్తినొందడమే మానవునికి పరమోత్కృష్టమైన విధి అని వారు నమ్మేవారు.

శ్రీ షణ్ముఖం గారు 1921-25 నడుమ కాలేజీలో చదువుతూ ఉండగా ఎవరైనా జీవన్ముక్తుని కలుసుకుని వారి ఆశీస్సులను పొందాలని ఎంతో తాపత్రయ పడ్డారు. షణ్ముఖం గారి ప్రార్థన ఈశ్వరుడు ఆలకించాడు. ఎమ్.జి. షణ్ముఖం గారి తండ్రికి దైవానుగ్రహం చేత తిరువణ్ణామలైకి బదిలీ అయ్యింది. తిరువణ్ణా మలైకి ప్రయాణం చేస్తుండగా వారికి శ్రీరమణుల మనో దర్శనం అయింది. ఈ విధంగా భౌతికంగా శ్రీరమణులను దర్శించుకోక ముందే సద్గురు రమణులు షణ్ముఖం గారి వద్దకు వచ్చి వారిని అనుగ్రహించడం జరిగింది.

షణ్ముఖం గారు ఆశ్రమం చేరారు. అంతులేని కారుణ్యము తొణికిసలాడి మందహాసంతో శ్రీరమణులు షణ్ముఖం గారికి స్వాగతం పలికారు. షణ్ముఖం గారిని చూడటం మొట్టమొదటిసారి అయినప్పటికీ వారిని చూడగానే గురు రమణులు మాతృప్రేమతో, "ఎప్పుడొచ్చావు? నీ కుడి చెయ్యి ఎలా ఉంది?" అని అడిగారు. శ్రీరమణులు షణ్ముఖం గారిని కుడిచేయి గురించి అడగటం వెనక ఒక కథ ఉంది. షణ్ముఖం గారికి 14వ యేట వారి కుడి చేయి బాగా దెబ్బతింది. చేతి గాయం నయమైనప్పటికీ ఆ చేయి వంకరగా మారటమే కాకుండా కుంచించుకు పోయినట్టు అయిపోయింది. ఈ వికలాంగాన్ని కప్పివుంచడానికి షణ్ముఖం గారు ఎప్పుడు పొడవు చేతుల చొక్కాలు మాత్రమే వేసుకుని, చేతిని ఎవరికీ కనబడకుండా కప్పివేసి ఉంచేవారు. వారి ప్రాణ స్నేహితులకు కూడా ఈ విషయం తెలియదు. వారి దగ్గర బంధువులకు, స్నేహితులకు కూడా తెలియని విషయం శ్రీరమణులకు ఎలా తెలిసింది? అంతేకాక ఆశ్రమానికి మొట్టమొదటిసారి వచ్చిన వారిపట్ల శ్రీరమణులు అంతటి శ్రద్ధని, ప్రేమను ఎలా చూపించగలరు? అటువంటి ప్రేమను కురిపించటం శ్రీరమణుల వంటి సద్గురువులకు మాత్రమే సాధ్యం. గురు రమణులు, "నీ కుడి చెయ్యి ఎలా ఉంది!" అని అడిగిన తర్వాత షణ్ముఖం గారికి అప్పటివరకు ఆ వైకల్యం వల్ల కలిగిన న్యూనతాభావం ఒక్కసారిగా మాయమయిపోయింది. గురు రమణుల అనుగ్రహాన్ని మించిన వరము, సంపద ఉండనే ఉండవు.

తొలిసారి శ్రీరమణుల సన్నిధి చేరుకున్నప్పుడు శ్రీరమణులు షణ్ముఖం గారిని తమ ఎదురుగా కూర్చోమన్నారు. అలా వారి ఎదురుగా కూర్చుని సునాయసంగా ధ్యానంలోకి జారుకుని శ్రీరమణుల అనుగ్రహాన్ని గ్రోలుతూ, రెండు గంటలకు పైగా కాలం గడిపారు శ్రీ షణ్ముఖం. నిజానికి అంత కాలం గడిచిన సంగతి తెలియలేదు వారికి. సద్గురువు సన్నిధిలో ప్రయత్నం వేగవంతమవుతుంది, ఆత్మ విచారణ మార్గం సుగమమవుతుంది. ఆత్మనిష్ఠ అనతికాలంలో సంభవిస్తుంది, అని షణ్ముఖం గారు తెలుసుకుని సత్సంగం, సదాచారం, ధ్యానం, ఆత్మనిష్ఠ -- ఇవన్నీ ఏకకాలంలో లభించేది గురు సన్నిధిలోనే అని తెలుసుకున్నారు. ఇటువంటి అనుభవం వారికి పూర్వం ఎన్నడు కలగలేదు. గురు రమణుల నుండి వారికి లభించిన తొలి ప్రసాదంగా దీనిని స్వీకరించి, హృదయంలో ఈ అనుభవాన్ని పదిలపరుచుకున్నారు షణ్ముఖం. నోరువిప్పి అడగకుండానే సద్గురువు వరాలను అనుగ్రహిస్తాడు అనే మాటకి అంతరార్థం గురు రమణుల సన్నిధిలో కూర్చున్నప్పుడు షణ్ముఖం గారికి అవగతమైనది.

ప్రతి రోజు మధ్యాహ్నం రెండు గంటలకి శ్రీరమణాశ్రమం చేరుకొని రాత్రి 8 గంటల వరకు శ్రీరమణుల సన్నిధిలోనే తరించే వారు శ్రీ షణ్ముఖం. కైవల్య నవనీతం, యోగవాసిష్టం వంటి ఉత్తమ అద్వైత గ్రంథాలను ఉటంకిస్తూ వాటి మహనీయతను శ్రీ రమణులు వివరిస్తూ ఉంటే షణ్ముఖం గారి ఆనందానికి అవధులు లేకపోయాయి. బ్రహ్మజ్ఞానియైన శ్రీరమణుల దివ్యసన్నిధిలో అంతులేని శాంతిని చవిచూశారు శ్రీ షణ్ముఖం.

శ్రీరమణులు షణ్ముఖం గారికి అనుగ్రహించిన ఉపదేశాలలో కొన్ని తెలుసుకుందాం.

1) ఏకాగ్రతతో శ్వాసని గమనిస్తుంటే ఆ అవధానవే కుంభకానికి దారితీస్తుంది. దీనినే 'జ్ఞాన ప్రాణాయామము' అని అంటారు.

2) నీవెంత వినమ్రుడవై ఉంటే అంత మంచిది.

3) సాధకుడు ఈ ప్రపంచాన్ని ఒక కలగా మాత్రమే భావించాలి.

4) విధినిర్వహణలో తప్ప మిగిలిన సమయాన్ని అంతా ఆత్మనిష్ఠలోనే గడపాలి.

5) ఇతరులకు కొంచెమైనా అంతరాయం కానీ ఆటంకం కానీ కలిగించకూడదు.

6) ఎవరి పనులను వారే చేసుకోవాలి.

7) 'నేను' పైనా, హృదయంపైనా లగ్నమై "నేనెవరిని" అన్న అభ్యాసం నిరంతరం కొనసాగించాలి. ఇటువంటి అభ్యాసం చేస్తున్నప్పుడు హఠాత్తుగా మనసు తలెత్తే ప్రమాదం ఉంటుంది. కావున ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి "నేను ఎవరిని" అనే విచారణ నిశితంగా కొనసాగించాలి.

శ్రీరమణులతో షణ్ముఖం గారికి 24 సంవత్సరాల సంపర్కం కలదు. ఇన్ని సంవత్సరాలలో రమణులు ఎప్పుడూ కూడా ప్రవచనాలు చేయటం షణ్ముఖం గారు చూడలేదు. కేవలము సాధకులు అవలంబించవలసిన సూచనలు మాత్రం చేసేవారు. గురు రమణులు సర్వజ్ఞులు అని అనడానికి షణ్ముఖం గారికి

ఎన్నో నిదర్శనాలు లభించాయి. షణ్ముఖం గారి తండ్రిగారు ప్రతిరోజు చేతి ఖర్చుకై మూడు అణాలు ఇచ్చేవారు. ఆ డబ్బుతో సాంబ్రాణి కొని దానిని శ్రీరమణులు కూర్చున్న సోఫాకి ఎదురుగా ఉండే కుంపట్లో వేసేవారు శ్రీ షణ్ముఖం. ఒకరోజు తండ్రిగారు వీరికి పైకం ఇవ్వలేదు. ఆ రోజు షణ్ముఖం గారు సాంబ్రాణి కొని శ్రీరమణులసన్నిధికి వెళ్లలేకపోయారు. మర్నాడు ఆశ్రమానికి చేరుకోగానే శ్రీరమణులు, "సాంబ్రాణి తేలేక పోయావు కాబట్టి నిన్న నువ్వు రాలేదు. ఆరాధన మనసులో ఉంటే చాలు" అన్నారు. ఇది ఒక నిదర్శనం అయితే ఇంకో నిదర్శనం చూద్దాం.

అకస్మాత్తుగా షణ్ముఖం గారి తండ్రి గారికి నెల్లూరుకి బదిలీ అయింది. కుటుంబ సభ్యులందరికీ తిరువణ్ణామలైని విడిచి వెళ్ళటం ఎంత మాత్రం ఇష్టం లేకపోయింది. అరుణాచలం వదిలి వెళితే శ్రీరమణుల దర్శనం లభించదు కదా!! పరమేశ్వరుడు కొలువుతీరిన కైలాసమే అరుణాచలం!! ఆ పరమేశ్వరుడే మానవ రూపం దాల్చి శ్రీరమణుల రూపంలో తిరువణ్ణామలైకి వేంచేశారు. అట్టి దైవాన్ని వదిలి వెళ్ళటం అసాధ్యమని షణ్ముఖం గారికి అనిపించింది. శ్రీరమణులకు షణ్ముఖం గారు తమ గోడుని విన్నవించుకున్నారు. వారితో చిరునవ్వు వేలార్చి ఊరుకున్నారు, శ్రీరమణులు. కొన్నాళ్ల తర్వాత ఆ బదిలీని అధికారులు రద్దు చేశారు. ఇలా షణ్ముఖం గారి వంటి ఎందరో భక్తులు మహర్షి సన్నిధిలో గడిపిన ప్రతి క్షణం నిరవధిక ఆనందంతో నిండిపోయి, వారు దివ్యపథం వైపు పయనించేలా చేసిందో తెలుసుకోవటం ఒక భాగ్యం.*(మూలం - శ్రీరమణ మహర్షితో ముఖాముఖి మరియు ఇంటర్నెట్)*

## Ask Not, for He Knows What is Best for You

(Dr K Subrahmanian)

Bhagavan always said that Arunachala is an extraordinary hill; it is magnetic. Once you see it, or once you think of it, it will keep dragging you to it till your mind becomes as still as the hill itself. He doesn't say till all your problems are solved! About prayer, Bhagavan says, "Your prayer may be answered today. Tomorrow, it may not be answered. Does it mean that God is useless? Does it mean that he listens to your prayers only occasionally? In this respect, remember, he knows what is best for you." Bhagavan said when we pray for something, we may get it or we may not get it. He said if our prayers are not answered, it is also because of God's grace. When I fall ill, you pray for my recovery; when I recover, you say that you are grateful to God for my recovery. But if every prayer is answered, then there will not be any death in this world. One day or the other, your prayer will not be answered. On that occasion, you will say that God was not kind, God was not gracious.

Praying is a good thing; it makes us humble. But the better thing is not to pray for anything. Bhagavan said that Arunachala is extraordinary because we don't have to pray to God for anything. When we have a desire, we pray for it, and then we may get it. Again, the next day, we want something else. This goes on and on. When we want

something, we have to work for it, and there will be many obstacles and difficulties in the process - so much frustration and anger. Bhagavan asks, “Where is the limit to these desires? Is there any end?”

*Ashaa re tadavastha bhoobhaagaa natataste*
*kaamaanaam kya nu paarah kaamaarer nama naareem*

(*Uma Sahasram*: 29-15)

*Aashas*, or desires, like the ocean, are limitless. There is no end to desires. If we want to end them, we must pray to the person who has no desires of any kind, whatsoever — *kaamaarer nama naareem*. That is, we have to bow to Amba or Parvati.

